క్లుప్తంగా

ఆనకట్టపై పిచ్చి మొక్కల తొలగింపు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆనకట్టపై ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. మొక్కలను తొలగించేందుకు ప్రతి ఏటా టెండర్ నిర్వహిస్తారు. ప్రస్తుతం వర్షకాలంలో ఏపుగా పెరగడం వలన ఆనకట్టపై రోడ్డు సరిగా కన్పించని పరిస్థితి నెలకొంది. ఆనకట్టపై పిచ్చి మొక్కలను తొలిగించడంతో రైతులు, పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'తపస్వి'కి నిత్యావసర సరుకుల అందజేత



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి కృష్ణవేణి పాఠశాల యాజమాన్యం శనివారం తపస్వి స్వచ్ఛంద సేవా సంస్థలో ఉన్న విద్యార్థుల కోసం నిత్యావసర సరుకులను అందజేశారు. కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపల్ మహ్మద్ మీనాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



నందిపేట్: ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. రెవెన్యూ సిబ్బందితో కలిసి ఆయన మండలంలోని సీహెచ్ కొండూర్ గ్రామంలో శనివారం ఈవీఎంలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

మెరుగైన వైద్య సేవలు అందిస్తాం



ఆర్మూర్‌టౌన్: డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ తెలంగాణ రాష్ట్ర అనస్థీషియా వైద్య సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికకావడంతో ఆర్మూర్‌కు చెందిన సామాజిక సేవకుడు తులసి సన్మానించారు. అనంతరం డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో విచారణ



నవీపేట: భూముల క్రమబద్ధీకరణ కోసం వచ్చిన దరఖాస్తుకు సంబంధించి తహసీల్దార్ వీర్‌సింగ్ శనివారం నవీపేటలో క్షేత్రస్థాయిలో విచారణ చేసి దరఖాస్తుదారుల నుంచి వివరాలు సేకరించారు. కబ్జాలో ఎంతకాలం నుంచి ఉన్నారనే వివరాలు కూడా సేకరించారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ దేవిసింగ్, గిర్దావర్ మోహన్ తదితరులు ఉన్నారు.

చేప పిల్లల ఉత్పత్తిని వేగవంతం చేయాలి



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన ఉన్న జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తిని వేగవంతం చేయాలని మత్స్యశాఖ ఏడీ రాజానర్సయ్య అన్నారు. శనివారం ఆయన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ ఏడాది 2.80 కోట్ల చేప పిల్లల ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. ఆయన వెంట మత్స్య అభివృద్ధి అధికారి డోలిసింగ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇళ్లు



రుద్రూర్: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండలంలోని రాణంపల్లి గ్రామంలో నాలుగు నివాసపు గృహాలు దెబ్బతిన్నాయి. గ్రామానికి చెందిన భూమయ్య, వెంకన్న, సాయవ్వ, సరవ్వలకు చెందిన పెంకుటిళ్లు కూలిపోయాయి.

కుర్చీలు ఉండవు.. లైట్లు వెలగవు

- బస్టాండ్ ఆవరణ అంతా గుంతలమయం
- సమస్యలకు నిలయంగా మారిన నందిపేట్ ఆర్టీసీ బస్టాండ్

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రమైన నందిపేట్‌లో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. 30 ఏళ్ల కిందట నిర్మించిన బస్టాండ్‌ను ఆ తర్వాత ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. బస్టాండ్‌లో కూర్చునేందుకు కనీసం కుర్చీలు కూడా లేవు. బస్టాండ్ ఆవరణం అంతా గుంతలమయంగా మారింది. ప్రయాణ ప్రాంగణాన్ని 1990 అక్టోబర్ 2న అప్పటి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి దర్మపురి శ్రీనివాస్ ప్రారంభించారు. రాత్రి సమయంలో దీపాలు వెలుగక పోవడంతో ప్రయాణికులు భయందోళనకు గురవుతున్నారు. వర్షాకాలంలో మోకాలు లోతు వరకు నీళ్లు వచ్చే పరిస్థితి ఉండటంతో ప్రయాణికులు బస్టాండు లోనికి వెళ్లాలంటే భయపడుతున్నారు. సెప్టిక్ ట్యాంకు లీకేజీ కారణంగా చుట్టుపక్కల ప్రాంతం అంతా కంపుకొడుతోంది. దీనికి తోడు పందులకు నిలయంగా మారింది.



గుంతలమయంగా తయారైన నందిపేట ఆర్టీసీ బస్టాండు ఆవరణం

చెత్త కుప్పలు తొలగించాలి



తాగునీటి ట్యాంకు వద్ద చెత్త కుప్పలు వెంటనే తొలగించాలి. తాగునీరు కలుషితం అవుతున్నా పట్టించుకోవడం లేదు. లైట్లు లేక రాత్రి పూట బస్టాండు ఆవరణం అంతా చీకటి ఉంటోంది.

–నద్పన్న, నందిపేట

కంపు కొడుతోంది



బస్టాండు ఆవరణలో ఉన్న సెప్టిక్ ట్యాంకు లీకేజీ అవుతోంది. దీని కారణంగా ఆ ప్రాంతం అంతా కంపు కొడుతోంది. ప్రయాణికులు బస్టాండులో ఉన్నంతసేపు ముక్కు మూసుకోవాల్సిందే.

–మంద దేవన్న, నందిపేట

నిండిన చెరువులు..

రుద్రూర్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి కోటగిరి, పోతంగల్, రుద్రూర్ మండలాల్లో సగానికి పైగా చెరువులు నిండాయి. సామర్థ్యానికి మించి వరద నీరు చేరడంతో కొన్ని చెరువుల తూముల నుంచి నీటిని విడుదల చేస్తున్నారు.

కోటగిరి ఉమ్మడి మండలంలో 30 చెరువులు, రుద్రూర్ మండలంలో చిక్కడపల్లి, రుద్రూర్, రాణంపల్లి, కొండాపూర్ చెరువులు నిండి అలుగులు పారుతున్నారు. చేపల వేటకు యువకులు పోటీ పడుతున్నారు. కోటగిరి 79.6 మి.మీ, పోతంగల్ 57.8 మి.మీ, రుద్రూర్ 32.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



నిండుకుండను తలపిస్తున్న రాణంపల్లి చెరువు

ప్రతి ఇంటికీ ఆరు మొక్కల పంపిణీ

మోర్తాడ్(బాల్కొండ): తొమ్మిదో విడత హరిత హారం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ ఆరు మొక్కలను పంపిణీ చేస్తున్నారు. జిల్లాలోని 530 గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహిస్తున్న నర్సరీలలో పండ్ల, పూల మొక్కలను పెంచుతున్నారు. ఇందిర క్రాంతి పథకం ఆధ్వర్యంలో మహిళా సంఘాల ద్వారా మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలు ఎండిపోతే జరిమానా విధిస్తామని ఇతర పథకాల అమలును నిలిపివేస్తామని ప్రభుత్వం పలుమార్లు హెచ్చరించింది. మొక్కల సంరక్షణ అవశ్యకతను ప్రజలకు వివరిస్తేనే పెరటి మొక్కలను పెంచడమే కాకుండా ప్రతి ఇల్లు ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉంటుందనే చెబుతూ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, సిబ్బంది, ఐకేపీ ఉద్యోగులు, మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి ప్రజలకు వివరిస్తూ మొక్కలను పంపిణీ చేస్తున్నారు.



నాగేంద్రనగర్‌లో మొక్కలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

'పనులు ప్రారంభిస్తే దీక్ష విరమిస్తాం'

రెంజల్(బోధన్): బందల్ల, మాసపురం, గంగమ్మ, శివాలయం రోడ్ల పనులను ప్రారంభిస్తే దీక్షలు విరమిస్తామని రైతులు పేర్కొన్నారు. పనులు త్వరలో ప్రారంభిస్తామని అందుకు దీక్షలు విరమించాలని ఎమ్మెల్యే షకీల్ ఎక్కడో చెప్పడం కంటే దీక్షా శిబిరం వద్దకు వచ్చి ప్రకటించి ఉంటే బాగుండేదని అన్నారు. రోడ్డు వేయాలని రెంజల్‌లో రైతులు చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 25వ రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో రైతులు చుక్కరా జుగౌడ్, కొండల్‌వాడీ శ్రీనివాస్, కటికెల శ్రీనివాస్, అమ్రాది వెంకటి, పోశెట్టి, లోలపు ఒడ్డెన్న, ఆర్మూర్ సంజీవ్, ఇటుకల ఖాజా, ఎల్ఐసి సాయిలు, చందూర్ నర్సయ్య, భూమేశ్, పిల్లి రాజన్న తదితరులు పాల్గొన్నారు.



రిలే దీక్ష చేస్తున్న రైతులు

కలిసి పని చేస్తే విజయం తథ్యం



కమ్మర్‌పల్లి: నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కట్టుగా పని చేస్తే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తథ్యం అని పీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ పేర్కొన్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఆరేంజ్ ట్రావెల్స్ యజమాని ముత్యాల సునీల్‌రెడ్డిని శనివారం వేణుగోపాల్ యాదవ్ హైదరాబాద్‌లో కలిసి అభినందనలు తెలియజేశారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్‌కు చెందిన కాంగ్రెస్, బీజేపీకి చెందిన పలువురు కార్యకర్తలు శనివారం వేల్పూర్‌లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అన్ని విధాల అండగా ఉంటానని వారికి మంత్రి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, నాయకులు బద్దం చిన్నారెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డంకులు సృష్టించినా అభివృద్ధి ఆగదు

వేల్పూర్: ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి ఆగదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వేల్పూర్‌లోని క్యాంపు కార్యాలయంలో కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన బీజేపీ కాంగ్రెస్ నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఆరోపణలు పట్టించుకోనని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. మోసపోతే గోస పడుతామని, ఇప్పటికే బాండ్ పేపర్ రాసిచ్చి ఎంపీగా గెలిచిన అర్వింద్ పసుపుబోర్డు తేలేక పోయారని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు డాక్టర్ మధుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో మంత్రి వేముల

డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

వేల్పూర్: మండలంలోని పడగల్‌లో శనివారం డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులను అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. 96 యూనిట్లకు 250 మంది దరఖాస్తు చేసుకోగా సర్వే చేసి 51 మందిని నిరుపేదలుగా గుర్తించి అప్పట్లోనే నేరుగా ఎంపిక చేశారు. మిగిలిన 45 మంది దరఖాస్తుదారులను డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. తహసీల్దార్ రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు రాజ్‌కుమార్, హన్మంత్‌రెడ్డి, శ్యాంరావు,ఆమోస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అధికారులు

డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి



బాల్కొండ: డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన పేదలకు వెంటనే పంపిణీ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు అంబటి నవీన్ డిమాండ్ చేశారు. శనివారం బాల్కొండలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇళ్లు నిర్మిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. ఈ సమావేశంలో బీజేపీ పార్టీ నాయకులు గణేష్, నర్సయ్య, శ్రీకాంత్, రాముస్ శివ, రాజేశ్వర్, శివానంద్, రాం కిషన్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు



బోధన్‌టౌన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బోధన్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర నాయకులు నర్సింహారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడ్లూరి శ్రీనివాస్, దామోదర్, తదితరులు కిషన్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

ఆహ్లాదం.. రాజరాజేశ్వరుడి ఆలయం

బాల్కొండ: ముప్కాల్ మండలంలోని కొత్తపల్లిలో ఉన్న రాజరాజేశ్వరుడి ఆలయం భక్తితో పాటు ఆహ్లాదాన్ని పంచుతోంది. ప్రతి సోమవారం భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. గతంలో పురాతన ఆలయం ఉండేది. గ్రామస్తులు ఐక్యంగా ఏర్పడి నూతన ఆలయాన్ని నిర్మించి అంచెలంచెలుగా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఆలయంలో కొలువుదీరిన రాజరాజేశ్వరుడిని దర్శించుకునేందుకు వెళ్లే భక్తులకు ఆలయం ముందర ఏర్పాటు చేసిన పచ్చని గార్డెన్, అక్కడ ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయానికి వచ్చే భక్తులందరూ తప్పనిసరిగా గార్డెన్‌లో సేదతీరి వెళ్తున్నారు. కొత్త జంటల ఫొటోషూట్ కేంద్రంగా మారింది. ఆలయానికి చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారు.



పచ్చని గార్డెన్‌లో రాజరాజేశ్వర ఆలయం

అనుకున్న పనులు జరుగుతాయి

ఆలయాన్ని సందర్శించే భక్తులు అనుకున్న పనులు జరుగుతాయి. ఆలయం ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండటం కారణంగా భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తారు.

– శ్రావణ్, ఆలయ పండితుడు

న్యాయవాదులకు చట్టాలపై అవగాహన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం న్యాయవాదులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా మాట్లాడుతూ భూమి, బ్యాంకు చెక్కులు, నేరాలకు సంబంధించిన చట్టాలపై న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఐనారి అశోక్, సీనియర్ న్యాయవాదులు భూపతి రెడ్డి, జక్కుల శ్రీధర్, ఐనారి అశోక్, సుకేష్, శ్రీనివాస్, రాజేశ్వర్, పవన్, శ్రావణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నసీం సుల్తానా

రోడ్డుపై కూరుకుపోయిన ట్యాంకర్



నందిపేట్: మండలంలోని ఉమ్మెడ గ్రామ శివారులో పెట్రోల్ ట్యాంకు లారీ బురదలో కూరుకుపోయింది. పంచగూడ, ఉమ్మెడ బ్రిడ్జి నుంచి నందిపేట వరకు కొనసాగుతున్న రోడ్డు పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ మట్టిపోసి వదిలేశాడు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్డులో ట్యాంకర్ కూరుకుపోయింది. రోడ్డు పనుల్లో నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా రహదారి



ఎడపల్లి: మండలంలోని జానకంపేట నుంచి మోస్రా వెళ్లే ప్రధాన రహదారిపై భారీ వర్షానికి ఠానాకలాన్ సమీపంలో భారీ గుంత ఏర్పడింది. రాత్రి వేళల్లో ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాధితులను ఆదుకోవాలి



బోధన్ రూరల్: వర్షాలకు కూలిపోయిన ఇళ్లు, నీట మునిగిన పంట పొలాలకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలోని అమ్దాపూర్‌లో ఇళ్లు కోల్పోయిన బాధితులను పరామర్శించి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



పెర్కిట్(ఆర్మూర్): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని బీహెచ్ఈఎల్ రిటైర్డ్ అడిషనల్ మేనేజర్ రమేష్ పవార్ సూచించారు. ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రీయ పాఠశాలలో శనివారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం రమేష్‌పవార్‌ను పాఠశాల యజమాన్యం సన్మానించారు. కార్యక్రమంలో క్షత్రీయ పాఠశాల యజమాన్యం అల్జాపూర్ గంగాధర్, ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సింహస్వామి, అనిల్ పాల్గొన్నారు.

మహిళలతోనే ఆర్థిక సాధికారత సాధ్యం



కమ్మర్‌పల్లి: మహిళలతోనే ఆర్థిక సాధికారత సాధ్యమవుతుందని ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్ అన్నారు. శనివారం కుమ్మర్‌పల్లిలో నిర్వహించిన ఝాన్సీ గ్రామ మహిళా సమాఖ్య వార్షిక మహాజన సభలో ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు రూ. 20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆదాయ వృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు రవికుమార్, అలేఖ్య, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన మాయని మచ్చ

కమ్మర్‌పల్లి: మణిపూర్ రాష్ట్రంలో గిరిజన మహిళలను సామూహిక అత్యాచార ఘటన మాయని మచ్చ అని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకుడు సారా సురేష్ విమర్శించారు. శనివారం కమ్మర్‌పల్లిలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అశోక్, నాయకులు కిషన్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బాధ్యత స్వీకరణ..

మాక్లూర్ ఎస్సైగా..



మాక్లూర్: మాక్లూర్ ఎస్సైగా సీహెచ్ సుధీర్‌రావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తూ నవీపేటకు బదిలీపై వెళ్తున్న యాదగిరిగౌడ్‌కు సిబ్బంది వీడ్కోలు పలికారు.

సీఐగా పదోన్నతి..



మోర్తాడ్: మోర్తాడ్ ఎస్సైగా పని చేసిన ముత్యంరాజు సీఐగా పదోన్నతి పొందారు.

బోధన్ ఇన్‌చార్జి ఎస్సైగా..

బోధన్‌టౌన్: ఎడపల్లి ఎస్సై పాండేరావ్ బోధన్ పట్టణ ఇన్‌చార్జి ఎస్సైగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్సై నవీన్‌కుమార్ బదిలీపై వెళ్లడంతో పాండేరావ్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు.

బోధన్ రూరల్ ఎస్సైగా..



బోధన్ రూరల్ : బోధన్ రూరల్ ఎస్సైగా నాగనాథ్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు.

సీఐకి సన్మానం..

నవీపేట: నిజామాబాద్ నార్త్ జోన్ సీఐ సతీష్‌ను ఎంపీపీ సంగెం శ్రీనివాస్ సన్మానించారు. నవీపేట స్టేషన్ తనిఖీకి వచ్చిన సీఐని ఎంపీపీ కలిసి స్థానిక పరిస్థితులను వివరించారు. వైస్ ఎంపీపీ హరీష్, బీఆర్ఎస్ నాయకులు ప్రవీన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యదర్శిగా నియామకం



మోర్తాడ్: కాంగ్రెస్ కమిటీ జిల్లా కార్యదర్శిగా మోర్తాడ్‌కు చెందిన గిర్మాజి గోపిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పని చేసిన ఆయన సేవలను వినియోగించుకుంటామన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్




పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	హిడింబ - 11.00, 4.40, 10.20 హత్య (తెలుగు) - 1.55, 7.35
స్క్రీన్-2 –	బేబి (తెలుగు) - 11.45, 3.15, 6.45, 10.15
స్క్రీన్-3 –	ఓపెన్‌హ్యామర్ (ఇంగ్లీష్) - 10.00, 2.00, 6.00, 10.00
స్క్రీన్-4 –	హర్ చాప్టర్ (తెలుగు) - 1.15, సామజవరగమన - 3.40 ఫొటో స్టూడియో - 6.40 మిషన్ ఇంపాజిబుల్ - 9.30

ఉద్యోగ భద్రత కల్పించాలి

రుద్రూర్/కమ్మర్‌పల్లి/ఎడపల్లి: ఉద్యోగ భద్రత కల్పించే వరకు ఆందోళన కొనసాగిస్తామని గ్రామ పంచాయతీ కార్మికులు వెల్లడించారు. డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె 17వ రోజుకు చేరింది. రుద్రూర్‌లో కార్మికులు ర్యాలీగా వెళ్లి భిక్షాటన చేసి నిరసన తెలిపారు. కమ్మర్‌పల్లిలో కార్మికుల సమ్మెకు సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, ఐఎఫ్‌టీయూ నాయకులు సారా సురేష్, ఖాజా మొయినొద్దీన్ మద్దతు ప్రకటించారు. ఎడపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు యేశాల గంగాధర్ మద్దతు తెలిపారు.



రుద్రూర్‌లో భిక్షాటన చేస్తున్న కార్మికులు



ఎడపల్లిలో..

సంక్షిప్తం

మహాసభను విజయవంతం చేయాలి

నందిపేట్: హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభలను విజయవంతం చేయాలని మాదిగ సంఘం ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి సరికెల పోశెట్టి కోరారు. నందిపేటలో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు.

గిరిజనులపై చిన్నచూపు తగదు

నవీపేట: మణిపూర్‌లో బీజేపీ ప్రభుత్వం గిరిజనుల పట్ల చిన్నచూపు చూడటం తగదని లంబాడి హక్కుల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రూడావత్ రఘు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్, కృష్ణ, విక్రమ్, వీరేందర్, సంజు, ఫకీరా, రాజారామ్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

నవీపేట: ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని బూత్ లెవల్ ఆఫీసర్లకు తహసీల్దార్ వీర్‌సింగ్ సూచించారు. వీరికి మాస్టర్ శిక్షకులతో శనివారం ఎంపీడీవో కార్యలయంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, శిక్షకులు గోపాల కృష్ణ, సుభాష్ పాల్గొన్నారు.